# ప్రకృతి - పురుషుడు

"అమ్మా ! అమ్మా!" భాధతో లుంగచుట్టుకుపోతూ వరలక్ష్మి కేక పెట్టింది. ఆ కేక విని ఏ అమ్మా పరిగెత్తి రాలేదు. పిల్లల్ని కన్న అమ్మలు, అమ్మల్ని కన్న అమ్మమ్మలు అంతా ఎవరి పనుల్లో వారున్నారు. బియ్యం ఏరుకుంటూ, ఉల్లిగడ్డలు తరుక్కుంటూ, రొట్టెలొత్తుకుంటూ ఉదయం పూట పనితో ఎవరి హడావిడిలో వారున్నారు.

వరలక్ష్మి నిస్సహాయంగా చూసింది. కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి. మళ్ళీ నొప్పి వస్తుంటే వెనుతిరిగి లోపలికెళ్ళి ఓ సంచిలో ఓ చీర, జాకట్టు, దుప్పటి, తువాలు పెట్టుకుని దిండుకింద దాచిన చిన్న పర్సు సంచికలో పెట్టుకుని బయటికి వచ్చింది. మహిళల మొహాల్లో రంగు ఓ క్షణం మారి మళ్లీ మామూలయింది. ఎవరి పనుల్లో వారు మునిగారు.

అంతా పిల్లల్ని కన్నతల్లులే - కంటున్న తల్లులే- తోటి ఆడదాన్ని కాస్తంత ఆదుకోవాలనే జాలి కూడా లేదా? కాదు. కానేకాదు. ఎవరింట్లో శుభం, అశుభం జరిగినా మేమున్నాం అంటూ ఆ వాడ వాడంతా కదిలి వస్తుంది. మరి అయితే పాపం వరలక్ష్మినెందుకమ్మా అట్లా అంతా చూస్తూ కూడా వదిలేశారు? "లేచొచ్చినదాన్ని, వుంచుకున్నాడితో కడుపులు తెచ్చుకున్నదాన్ని యెలేయక ఎట్టా కలుపుకుంటామమ్మా? మాకూ పెళ్లీడుకొచ్చిన పిల్లలున్నారు. ఇలాటి రకాలని సూసి అల్లుసెడిపోరూ"

పాపం వరలక్ష్మి ఆయినింట పుట్టి బొద్దుగా, కళగా ముద్దబంతి పూవులా వుండేది. ఉన్న వూర్లో స్కూలు ఫైనల్ చదివేసి తోటలవెంట, చెరువు గట్లంట వనలక్ష్మిలా స్నేహితురాళ్లతో కల్సి పాటలు పాడుకుంటూ, ఉయ్యాల్లూగుతూ, సినిమాలు, టి.వి.లు చూసుకుంటూ, చద్దన్నం తిని, చాపేసుకుని పత్రికలు, నవల్లు చదువుకుంటూ కడుపులో చల్ల కదలకుండా ఉండే పిల్ల.

సినిమా షూటింగుకు ఆ వూరు సినిమావాళ్లు రావడం, అసిస్టెంట్ డైరెక్టరు భాస్కర్ కంట వరలక్ష్మి పడడం, బొద్దుగా, ముద్దబంతిపూవులా, సావిత్రిలా ఉన్న వరలక్ష్మిని స్టారు చెయ్యాలన్న ఆలోచన అతనికి రావడం యీ పిచ్చిపిల్ల ఆ మాటలు నమ్మి సినిమా వ్యామోహంలో యిల్లు విడిచి అతనితో వెళ్లడం, స్టారు కాలేక, ఎక్స్ట్రాగా మిగిలిపోవడం, అతన్ని గుడ్డిగా నమ్మి సర్వం అతనికర్పించడం, గర్భం అని కూడా తెల్సుకోక అమాయకత్వంతో నాలుగు నెలలు గడిచిపోవడం, గర్భవతి అని తెలిసి ఆ

డైరెక్టరు ఆమెని వదిలిపోవడం, వరలక్ష్మికి పరిస్థితి అర్ధమయ్యేవేళకి ఆరునెలల కడుపు, చేతిలో అరొందలు మిగిలాయి. కడుపు ముందుకు వస్తుంటే వేషాలు వెనక్కి వెళ్ళాయి. తోటి ఎక్స్ట్రా నర్సమ్మ ఆమె పరిస్థితికి జాలిపడి తన వాడలో ఇల్లు కుదిర్చిపెట్టి చాతనయినంతగా ఆదుకోవడం గుడ్డిలో మెల్ల. మూతి విరుపులు, చీదరింపులు మధ్య ఓ పూట తిని, ఓ పూట తినక చావలేక, బతకలేక బతుకున్న వరలక్ష్మి జాలికథ యిది.

నడుం పట్టుకుని నాలుగడుగులు వేయగానే దేముడే పంపినట్టు అన్వర్ ఆటో వచ్చి ఆగింది, ఎర్రబడ్డ మొహం, నొప్పితో గిలగిలలాడుతున్న బాధ ఆమె మొహంలో చూసి అన్వర్ అదుర్దాగా ఆటో దిగాడు. వరలక్ష్మికి ప్రాణం లేచొచ్చింది. 'అన్నా, నన్ను కాస్త దవఖానాకు తీసుకుపోతావా' అంది ఆయాసపడుతూ, అన్వర్ నలుగురు బిడ్డల తండ్రి, ఆడకూతురు అవస్థ అర్థమైంది ఎక్కమ్మా'' అన్నాడు.

అది జనానా ఆస్పత్రి! ఏ కాలం నాటిదో ఆ ఆడవాళ్ల అస్పత్రి, పటిష్టమైన బండరాళ్లతో కట్టిన ఆస్పత్రి. ఈనాటికీ, చెక్కుచెదరక ఎన్ని లక్షల జననాలో కళ్ల చూసిన అస్పత్రి అది. అక్కడ నిర్విరామంగా 'పుట్టుకలు' జరిగిపోతుంటాయి. కొండొకచో 'గిట్టుకలు' కూడా! పురుళ్ళు పోయడమే మా పని అన్నట్టు లేబర్ రూములో నాలుగు బల్లలు - ఆ బల్లలు ఎప్పుడూ ఖాళీ వుండవు. బిడ్డ పుట్టినా, చచ్చినా ప్రయత్నం అంతా యాంత్రికంగా జరిగి పోతుంటుంది. నిమిషానికో, ఐదు నిమిషాలకో బిడ్డ పుడ్తుంటే అక్కడ విచారాలకి, సంతోషాలకి తావుండదు.

అలాంటి జనానా అస్పత్రికి, జనారణ్యంలోకి ఆటో వచ్చి ఆగింది. ఔట్ పేషంటు వార్డు దగ్గిర, నెమ్మదిగా అన్వర్ చేయి అందించి వరలక్ష్మిని దింపాడు.

అక్కడ బారులు తీరి క్యూలో రకరకాల జబ్బులతో ఆడవాళ్లు నిలబడ్డారు. అంతా చకచక ఎవరి పనులు వారు యంత్రాల్లా చేస్తున్నా తరగతిని క్యూ- బిక్కమొహంతో బాధని బిగపెట్టిన వరలక్ష్మి వంతు వచ్చేవరకూ కాన్పు ఆగదని మగాడైన అన్వర్‌కీ అర్థమై ముందుకెళ్లి 'సలాం, డాక్టరమ్మా, యీ అమ్మకి నెప్పులు బాగా వస్తున్నాయి. నిలబడలేకపోతుంది. జరముందీమెను చూడండమ్మా' చేతులు జోడించి అన్నారు. డాక్టరు రాత ఆపి కళ్ళెత్తి వరలక్ష్మిని చూసింది. మొహం చూసి నెప్పుల తీవ్రత, కాన్పు అయ్యే సమయం అనుభవంతో లెక్క కట్టగలిగే ఆమె ఇన్‌పేషెంట్ చీటి రాసి ఎటు వెళ్ళాలో చూపిస్తూ ' ఈ చీటీ తీసికెళ్లి అక్కడ నర్సుంటుంది. చూపించి చేర్పించు' అంది. ఆ క్షణంలో వరమిచ్చిన దేవతలాగ అన్పించింది యిద్దరికి.

ఆ వరండా దాటి మలుపు తిరిగితే అక్కడ లేబర్ వార్డు. లేబర్ రూము. అక్కడో

బల్లముందు తెల్లబట్టల నర్సు. ఆ నర్సు వరలక్ష్మిని లోపలికి తీసికెళ్లి పరీక్షల రూములో ఓ బల్ల ఎక్కించింది. 'డాక్టరమ్మ వచ్చి చూస్తారు' అని చెప్పి వెళ్లింది. 'ఆ దోల్లు ఎవరూ లేరా, నీవిక్కడ వుండరాదు. యింటికెళ్లి ఆడవాళ్లని పంపు' అంది బల్లదగ్గిర నర్సు. "యాదమ్మని పంపిస్తానని ఆ అమ్మకి చెప్పు తల్లీ' అన్నాడు అన్వర్.

కొన్ని యుగాలనంతరం అన్నట్టు ఓ డాక్టరమ్మ వచ్చి యాంత్రికంగా పొట్ట నొక్కి పొజిషన్ చూసింది. స్కెతస్కోపు తీసి హార్ట్ బీట్ వింది.

వరలక్ష్మికి పాపం తొలికాన్పు. ఇప్పుడు తల్లిలేని, ఎవరూలేని వంటరి. నడుం దగ్గిర నొప్పి వచ్చినపుడల్లా గిలగిల్లాడుతూ 'అమ్మా' అంటోంది. తల్లిని తలుచుకొంటుంటే వరలక్ష్మి చెంపలంబడి వెచ్చటి కన్నీరు జారింది.

వరలక్ష్మికి నెప్పుల జోరు అందుకుంది. ఓ గంట తరువాత మగ బిడ్డ పుట్టాడు. ఆయాలిద్దరూ సాయం పట్టి తల్లిని, పిల్లాడిని స్ట్రెచర్ మీద పడుకోబెట్టి వార్డులో ఖాళీ మంచం మీదకి చేర్చి వెళ్లిపోయారు.

నిస్త్రాణతో పక్కమీద పడుకున్న వరలక్ష్మి గొంతు తడార్చుకు పోసాగింది. గొంతు తడిసే దిక్కేలేదు. గుక్కెడు నీళ్ళిచ్చే దిక్కేలేదు. పక్కనున్న మంచంమీద ఓ అమ్మాయి మగతగా పడుంది. తల్లి కాబోలు మాటిమాటికి కళ్లు, ముక్కు తుడుచుకుంటోంది. 'పావం బిడ్డ దక్కలేదు గాబోలు' యిటు అటు మంచాల మీద వాళ్లు మాట్లాడుకుంటున్నారు. ఆవిడ టేబిల్ దగ్గర మంచినీళ్ల సీసా చూసి 'అమ్మా కాసిని మంచినీళ్లిస్తారా గొంతెండిపోతుంది" అంది బిడియంగా వరలక్ష్మి. "అయ్యో దానికేమమ్మా, నీ వాళ్లెవరూ లేరా దగ్గిర, తొలిచూలా అమ్మలేదా, అత్తింటి వాళ్ళన్నా లేరా' అంటూ నీళ్ళు గ్లాసులోకి పంపి యిచ్చింది. 'అయ్యో బిడ్డ ఏడుస్తున్నాడు. రెండు పాలచుక్కలు, లేదంటే కాస్తంత తేనె చుక్కలు, నీళ్లు కలిపి పట్టాలమ్మా' అంటూ ఆవిడ ఫ్లాస్కులోంచి కొద్దిగా పాలు తీసి చిన్నగ్లాసులో పోసి నీళ్లు కలిపి చెమ్చాతో రెండు మూడు చెంచాలు పిల్లవాడికి పట్టింది. వరలక్ష్మి చటుక్కున ఆవిడ చేయి పట్టుకుంది. 'అమ్మా యీ బిడ్డని మీరు తీసుకుంటారా అమ్మా. ఈ బిడ్డని నేను పెంచలేను. మీరు కాదంటే ఏ అనాథాశ్రమంలోనో వదలాలి' గబగబ ఆరాటంగా అంది. ఆవిడ తెల్లపోయింది. 'బిడ్డనిచ్చేస్తావా, నీ వాళ్ళూరుకుంటారా' అంది. వరలక్ష్మి టూకీగా తన కష్టాల కథ అంతా చెప్పింది. 'పిల్లాడికి పరపడానికి పక్కబట్టలన్నా గతిలేని దాన్ని, వీడ్ని ఎలా పెంచాలమ్మా. మీరు అయినింటివాళ్లలా వున్నారు. మంచి వాళ్లలా వున్నారు. మీ ఇంట నా బిడ్డ పెరిగితే నాకు నిశ్చింతగా వుంటుంది' అంది దండం పెడుతూ. ఆవిడ కళ్లు మెరిశాయి. కనపడని దేముడికి చేతులెత్తి దండం పెట్టింది. వరలక్ష్మి పక్కలో బిడ్డ

యిప్పుడు ఆ అమ్మాయి పక్కలో కదలుతున్నాడు. తెలివి వచ్చాక తల్లి విడమర్చి కూతురికి చెప్పింది.అల్లుడికింకా ఫోను చేయక ముందే యిలా జరగడం, స్పెషల్ రూము యింకో గంటలో ఖాళీ అవుతుందని, అంతవరకు వార్డులో వుండవలసి రావడం, ఇలా జరగడం అంతా దైవేచ్ఛ అనుకున్నారు. వరలక్ష్మి చేతులు పట్టుకున్నారు. ఈ రహస్యం తమ మధ్యనే వుండాలని షరతు పెట్టారు. పిల్లాడిని ఎప్పుడు చూడడానికైనా రాకూడదన్న మాట తీసుకున్నారు. వరలక్ష్మి అన్నింటికీ తలవూపింది. ఆమెకింకా తను తల్లినయానని, ఆ బిడ్డ తన రక్తం పంచుకు పుట్టిన బిడ్డ అనే భావమే కలగలేదు. తనున్న ప్రస్తుత పరిస్థితిలో ఆ బిడ్డ భారం ఎలా వదల్చుకోడం అన్న చింత యిప్పుడు బిడ్డ మంచి యింట్లో పెరుగుతాడన్న భావం నిశ్చింత నచ్చింది. పేరు, వూరు, వివరం అడిగింది. అల్లుడు బెంగుళూరులో కన్నడ సినిమాలకి అసిస్టెంటు డైరెక్టర్‌గా పనిచేస్తాడని, పెళ్ళయ్యాక అమ్మాయికిది మూడో కాన్పు అని, పుట్టక ముందు ఒకరు, పుట్టాక ఒకరు పోయారని ఈ కాన్పు అయినా దక్కలేదన్న విచారంలో వున్న వారికి ఇది భగవంతుడిచ్చిన వరంగా భావిస్తున్నామని చెప్పింది సినిమాలు, డైరెక్టరు అనగానే కుతూహలంగా పేరడిగిన వరలక్ష్మి మాన్పడిపోయింది ఆ పేరు విని! ఎంత విచిత్రం భగవంతుడి లీల! ఒక్క క్షణం ఏదో ఆవేశం వరలక్ష్మిని చుట్టుముట్టింది. బిడ్డనివ్వనని చెప్పాలనిపించింది. మరోక్షణం వివేకం మేల్కొంది. పక్కమీద నున్న ఆమె వంకచూసింది. కాస్తంత మొద్దావతారం. అందుకే తన వెంట పడ్డాడు. ఆమె మౌనం మొహంలో భావం చూసి ఆవిడ మరోలా అర్థం చేసుకుని భర్తనడిగి ఒక కవరు తెచ్చి వరలక్ష్మి చేతిలో పెట్టింది. 'అమ్మా బిడ్డనమ్ముకున్నాననుకోకు. నీవున్న యీ స్థితిలో యీ డబ్బు నీకవసరం. కాదనకు' అంది. వరలక్ష్మి కాదనలేదు. గత నాలుగైదు నెలలుగా డబ్బవసరం ఎంతటిదో వరలక్ష్మికి బాగానే అర్థం అయింది. కవరు గుప్పిటలో గట్టిగా పట్టుకుంది. అపుడు చూసింది. ఆమె పక్కనున్న బిడ్డవంక, గుప్పిటమూసి, కళ్ళు మూసిన ఆ చిన్నారి మొఖం భాస్కర్ మొహంలాగే వుంది. క్షణంలో చప్పున మొహం తిప్పుకుంది. ఆమె జీవితంలో ఓ అధ్యాయం ముగిసింది.

* * *

అధ్యాయం ముగిసింది కాని కథ ముగియలేదు.

బెంగుళూరు ఇందిరానగర్‌లో చిన్న డాబా యింటి ముందు ఆ రోజు ఓ పెద్ద పడవలాంటి కారు వచ్చి ఆగింది. అందులోంచి ప్రముఖ తెలుగునటి 'వరశ్రీ' దిగుతుంటే యిరుగుపొరుగు గుమిగూడారు. ఇంట్లో వాళ్లు గుమ్మంలోకి వచ్చి గుర్తుపట్టి తెల్లబోయారు. కాలం కల్సి రావడం అంటే అదేమరి- కెమెరా 'వ్యూఫైండర్ నుంచి'

షాట్ కోసం చూస్తున ఓ ప్రముఖ డైరెక్టర్ కంట ఎక్స్ట్రా వరసలో నిల్చున్న వరలక్ష్మి కంటపడిన ఆ క్షణం ఆవిడ దశ తిప్పింది. సావిత్రిలా వున్న వరలక్ష్మి నెక్ట్ పిక్చరులో హీరోయిన్ అయింది. ఆ సినిమా పెద్ద హిట్టు - తరువాత రెండు సినిమాలు పెద్ద సక్సెస్. రెండేళ్ళలో ఆరు సినిమాల్లో నటించి నాలుగు హిట్లు యిచ్చిన వరలక్ష్మి వరశ్రీగా మారి పెద్ద హీరోయిన్ అయింది. అంత పెద్ద నటీమణి యిక్కడికెందుకు వచ్చింది? కుర్చీలోంచి గాభరాగా లేచిన అతను అసిస్టెంటు డైరెక్టరుగా నైనా ఆంధ్రాలో చెల్లుబాటు కాక కన్నడ సినిమాలకి వచ్చిన బాస్కర్. ఎందుకొచ్చింది? భాస్కర్ మొహంలో భయం తన మీద కక్ష తీర్చుకోడానికి వచ్చిందా? గుమ్మంలో నిల్చున్న భార్య. అత్తగారి మొహంలో భయం. ఆదుర్దా, పిల్లాడి గుట్టు బయటపెట్టి యిచ్చేమంటుందా? పాలిచ్చి ఆరేళ్లనించి పెంచుకుంటున్న ఆ తల్లి ఆందోళన!

గుమ్మంలోకి వయ్యారంగా వచ్చి అందరివంక చిద్విలాసంగా ఓ నవ్వి విసిరి 'బాగున్నారా' అంది వరశ్రీ. అంతా అప్రయత్నంగా తలాడించారు. 'యీవిడ. యీ అమ్మాయి, మన అమ్మాయి పురుడు పోసుకున్న ఆస్పత్రిలోనే పురుడు పోసుకుంది. పాపం ఎవరూ దిక్కులేదని...' అత్తగారు అందరికంటె ముందు అందుకుంది. భాస్కర్ గాభరాగా చూశాడు. "అవును పాపం చాలా సాయం చేశారపుడు" వరశ్రీ నవ్వుతూ అంది. భాస్కర్ మొహంలో గిల్టి ఫీలింగు. 'పాపం పిల్లాడుపోయాడు' అంది అత్తగారు. భాస్కర్ మొహంలో పెద్ద రిలీఫ్.

'మీ బాబెలా వున్నాడు. పెద్ద వాడయిపోయుంటాడు. ఈ వూర్లో షూటింగుంది. ఓసారి చూసి పోదామని వచ్చా- మీ వారేగా నన్ను ముందు సినిమాల్లో ఎక్స్ట్రా చేసింది. తన పరిచయం చెప్పింది. పక్కింట్లో ఆడుతున్న బాబు పరిగెత్తి వచ్చాడు. 'అబ్బో ఎంత పెద్దవాడయిపోయాడో- ఆరేళ్లు కదూ' అంటూ డ్రైవరు తెచ్చిన ప్యాకెట్లు, బొమ్మలు, డ్రస్సులు, చాక్లెట్లు అన్ని యిస్తూ 'తీసుకో బాబు అన్నీ నీకే' అంది దగ్గరకి లాక్కొని ప్రేమగా, 'నీకొడుకు నీ పోలికే అంది చిలిపిగా. నా కొడుకు నాలా వుండక ఎలా వుంటాడు' భాస్కర్ కళ్లల్లో కించిత్తు గర్వం. భార్యా, అత్త మొహాలు చూసుకున్నారు. వరలక్ష్మి మొహంలో కనపడిన చిలిపి చిరునవ్వు వారి దృష్టిని పడలేదు.'వస్తా-వూరికే చూసి పోదామని వచ్చాను' బాబు బుగ్గమీద ముద్దు పెట్టింది. 'కూర్చోండి, కూర్చోండి లోపలికి రండి' అంతా గాభరాగా అన్నారు. 'వస్తా, పనుంది బాబుని చూడాలని వచ్చానంతే' అందరి మోహాలలో పెద్ద రిలీఫ్.

కారు ఎక్కి వీడ్కోలు చెప్పడానికి వచ్చిన భాస్కర్‌తో కిటికీ లోంచి తల బయటపెట్టి 'నీవచ్చింది నీకే యిచ్చేశాను' అంది నవ్వి- అర్థంకాక తెల్లపోయి చూస్తున్న భాస్కర్‌తో

'ఆడదానికెప్పుడూ యివ్వడమే గానీ తీసుకోవడం తెలీదు. అర్థంకాలేదా. ఆలోచించు' అంటూ నవ్వి 'ఆడదాన్ని అందుకే ప్రకృతితో పోల్చారు-నీకర్థం కాదులే, నీలాంటి మొగాళ్లకి అర్థం కాదు' అంటూ 'పోనీయ్' అంది డ్రైవర్‌తో.

ఏమంది వరశ్రీ? మీకూ అర్థం కాలేదా? 'ప్రకృతి - పురుషుడు' స్త్రీ ప్రకృతి ప్రకృతికి యివ్వడమే తెలుసు. బదులు తీర్చమని అడగదు. సూర్యుడు వెలుగు యిచ్చి వెలకట్టడు! చంద్రుడు చల్లదనం యిచ్చి బదులడగడు. వాయువు ప్రాణాధారమైన గాలిచ్చి ధర కట్టదు. వరుణుడు నీరిచ్చి ధర యింత అనడు. అగ్ని వేడి యిచ్చి బదులేం యిస్తావు అనదు. ప్రకృతి యివ్వడమే తనధర్మం అనుకుంది. స్త్రీ కూడా అంతే! నవమాసాలు బిడ్డని మోస్తూ కడుపులో బిడ్డ కాలితో తన్నినా వెల కట్టదు! నిద్రాహారాలు మాని అష్టకష్టాలు పడి బిడ్డని పెంచినా ప్రతిఫలం కోరదు. పాలు తాగి రొమ్ము గుద్దినా సహించి యిదేం అని అడగదు. తన గుండె కోసి ప్రియురాలికిస్తూ జారిపడిన కొడుకుని 'జాగ్రత్త నాయనా' అనే అంటుంది. తన ధర్మం నెరవేర్చని కొడుకుని క్షమించి 'నాయనా నీవెక్కడున్నా సుఖంగా వుండు' అనే దీవిస్తుంది. పురుషుడికి శరీరం అర్పించడం తప్ప కనీసం నా కోరిక తీర్చు, నాకు సుఖం కావాలని అని నోరు తెరిచి అడగదు. అడగలేదు. ప్రతి దశలో ఆడదానికి అర్పించడమే తెలుసు. అందుకే స్త్రీని 'ప్రకృతి'తో పోల్చారు. ప్రకృతి-పురుషుడు అని వూరికే అనలేదు.

ఈ ఆరేళ్ళలో ఆరువందల సార్లైనా పిల్లాడిని తెచ్చుకొని భాస్కర్‌కి బుద్ధి చెప్పాలన్న ఆలోచన వచ్చినా కన్నబిడ్డని, కళ్లిప్పని బిడ్డని కంటితో కూడా సరిగా చూడకుండా, స్తన్యం అయినా యివ్వకుండా పరాయివాళ్ల చేతుల్లో పెట్టి చేయి దులుపుకున్న తనకి తల్లి అనిపించుకునే హక్కులేదు అని తెల్సుకున్న వరలక్ష్మికి యివ్వడంలోని ఆనందం, క్షమలోని ఔదార్యం, తృప్తిని మించినది ఏది లేదని అర్థం చేసుకుంది కనక ప్రకృతితో పోల్చుకుంది గర్వంగా.

'ఓరే మగాళ్లూ, వెర్రివెంగళాయిలూ, స్త్రీ కంటె తామెక్కువని గర్వపడి, స్త్రీని తమ చెప్పుచేతుల్లో వుంచుకోగలమని విర్రవీగేమీకు, శారీరకంగా బలవంతులు అయి స్త్రీని గుప్పిటలో వుంచుకున్నామని గర్వపడే మీరు 'ప్రకృతి-పురుషుడు' అన్నపదంలో స్త్రీ కిచ్చిన స్థానం తెల్సుకోండిరా వెంగళప్పలూ' అని చెప్పకనే చెప్పింది వరలక్ష్మి.

◆ ('ఆంధ్రప్రదేశ్' మే-2002)